కళాశాలలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన

రామాయంపేట, ఆగస్టు 9: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతీ విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించినట్లు ప్రిన్సిపాల్ హిమజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, ఇంటర్ జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, చేగుంట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రజినీకుమారి హాజరయ్యారు.

వాహనాల వేలం

మెదక్ అర్బన్, ఆగస్టు 9: పోలీస్‌స్టేషన్లలో గుర్తుతెలియని, యజమానులు తీసుకోని వాహనాలను వేలం (స్క్రాప్) వేయనున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న వాహనాలను ఈ నెల 21న జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 103 వాహనాలను (స్క్రాప్‌గా) వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆర్ఐ శైలేందర్ 8712657912, ఆర్ఎస్సై మహిపాల్ 8712657911ను సంప్రదించాలని సూచించారు.

బోర్‌మోటర్ కేబుల్ చోరీ

చిలిపిచెడ్,ఆగస్టు 9: మండలంలోని చందూర్ గ్రామ శివారులో 20 మంది రైతుల పొలాల వద్ద ఉన్న బోరు మోటర్ కేబుల్ వైర్లను దుండగులు చోరీ చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గురువారం అర్ధరాత్రి దుండగులు బోరు మోటర్ దగ్గర కేబుల్ వైర్, సాటర్ డబ్బా వరకు కట్ చేసి దొంగలించారు. రైతులందరివీ కలిసి రూ.50 వేల ఆస్తి నష్టం జరిగింది. తమకు న్యాయం చేయాలని రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి, విచారించారు.

ఎరువుల షాపులు తనిఖీ చేసిన వ్యవసాయాధికారి

కౌడిపల్లి, ఆగస్టు 9: కౌడిపల్లిలోని ఎరువుల షాపులతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయధికారిని ఏవో స్వప్నాజాదవ్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ప్రతి షాపులో స్టాక్‌బోర్డు, ఎరువుల పట్టిక తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాలతో కూడిన సమాచారాన్ని రైతులకు వివరించి మందు లు విక్రయించాలని తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.6.59 లక్షలు లూటీ

తూప్రాన్, ఆగస్టు 9: ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరిట టెలిగ్రామ్ ద్వారా వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసిన ఓ వ్యక్తి రూ.6.59 లక్షలు పోగొట్టుకున్న ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన ఓ వ్యక్తికి గత నెల 16న టెలిగ్రామ్ అకౌంట్ ద్వారా ఆన్‌లైన్ పార్ట్‌టైం (ప్రొడక్ట్ బిజినెస్) అంటూ ఒక లింక్ వచ్చింది. అందులో అడిగిన వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేశాడు. పలు దఫాలుగా రూ.6.59 లక్షలు తన ఖాతా నుంచి కట్ అయ్యాయి. తన టెలిగ్రామ్ ఖాతాలో రూ.10 లక్షల నగదు జమ అయినట్లు చూపించడంతో, విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించాడు. డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో, తన ఆన్‌లైన్ ఖాతాలో ఉన్న కస్టమర్ కేర్ నెంబర్‌కు ఫోన్ చేయగా, మరో రూ.5 లక్షలు చెల్లిస్తేనే డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చని సూచించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టెంట్‌హౌస్ ప్రారంభం

చిన్నశంకరంపేట, ఆగస్టు 9: పట్టణంలో టెంట్‌హౌస్‌ను ఎమ్మెల్యే రోహిత్ శుక్రవారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES

★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580

NT- 332617

WANTED

★మెదక్ జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు/గార్డ్స్ కావలెను. నెలకు జీతం: 21,000/17,000. ESI, PF సౌకర్యం కలదు. అర్హత: డిగ్రీ/టెన్త్, వయస్సు: 20-40 సం॥ లోపు, ఎత్తు: 5.6", మంచి అనుభవం కలవారు కావలెను. అన్ని వసతులు కలిగిన ఉచిత బ్యాచిలర్ రూమ్ కలదు. సెల్ నెం: 8341038715, 9848328701, 8919606707.

NT-98111

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రామాయంపేట: పట్టణంలోని గురుకుల విద్యాలయంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ: 12వ వార్డులో మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

అల్లాదుర్గం: కాయిదంపల్లిలో మొక్కను నాటుతున్న జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

జీవకోటి మనుగడకు చెట్లు మూలం

- జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఒక్కరోజే 2 లక్షల మొక్కలు పూర్తి
- స్వచ్ఛదనం పచ్చదనంలో భాగస్వాములు కావాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- వనమహోత్సవంలో కలెక్టర్ రాహుల్‌రాజ్
- పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి
- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ/రామాయంపేట/నిజాంపేట/పెద్దశంకరంపేట/వెల్దుర్తి/మెదరూరల్/అల్లాదుర్గం/చిలిపిచెడ్/నర్సాపూర్/తూప్రాన్, ఆగస్టు 9: ప్రతి జీవి మనుగడకు చెట్టే ప్రధానమని, చెట్టు లేకపోతే బతికే అవకాశం లేదని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం రామాయంపేట, తూప్రాన్‌లో నిర్వహించిన వనమహోత్సవంలో భాగంగా స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి హాజరై మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ఒక్కరోజే రెండు లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. నీరు నిల్వ ఉంటే రోగాలబారిన పడతారని, మలేరియా, డయేరియా తదితర వ్యాధులు వస్తాయన్నారు. మెదక్ పట్టణంలోని 12వ వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అనారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నర్సాపూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మొక్క నాటుతున్న జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు

వెల్దుర్తి : మంగళపర్తిలో వనమహోత్సవంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, అధికారులు

మెదక్ రూరల్: పాతూరులో స్వచ్ఛ, పచ్చదనంపై ప్రజలకు అవగాహన చేస్తున్న అధికారులు

నిజాంపేట: బచ్చురాజ్‌పల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రాజిరెడ్డి, తదితరులు

పెద్దశంకరంపేటలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్, ఎంపీడీవో, అధికారులు

చిలిపిచెడ్: అంతారంలో మొక్క నాటుతున్న మండల ప్రత్యేకాధికారి మాన్య నాయక్, ఎంపీడీవో

అర్హులకు రుణమాఫీ ఇవ్వకుంటే ఆందోళన చేస్తాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

రచ్చబండలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

పాపన్నపేట, ఆగస్టు 9: పట్టాదారు పాసుబుక్‌లు ఉన్న రైతులందరికీ పంట రుణమాఫీ ఇవ్వకుంటే ఆగస్టు 15 తర్వాత కలెక్టరేట్లను ముట్టిడిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం పాపన్నపేటలో కిసాన్ మోర్చాఅధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణమాఫీతో డ్రామాలు అడుతున్నదన్నారు. అర్హులైన రైతులకు పంట రుణమాఫీ రాలేదన్నారు. రేషన్‌కార్డులో ఉన్న ఒక్క వ్యక్తికి మాత్రమే పంట రుణమాఫీ చేయడం సరికాదన్నారు. బాధిత రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలు చు ట్టూ తిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాములు, మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సిద్దిరాములు ఉన్నారు.

సగంమందికే పంట రుణమాఫీ అయ్యింది

శివ్వంపేట, ఆగస్టు 9: పంట రుణమాఫీ 50 శాతం రైతులకే అయ్యిందని రైతురక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్యయాదవ్ అన్నారు. శివ్వంపేట కోఆపరేటీవ్ బ్యాంకులో 1030 ఖాతాలు ఉంటే 450 మందికి మాత్రమే పంట రుణమాఫీ అయ్యిందన్నారు. ఐండెన్ బ్యాంకులో వెయ్యికి 444 మంది, దొంతి యూనియన్ బ్యాంకులో 1270 మందికి పంట రుణమాఫీ జరిగిందన్నారు.

వరి, పత్తి పంటలో తామర పురుగును గురించాలి

శీలాంపల్లిలో వరి పంటను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏవో బాల్‌రెడ్డి

చిలిపిచెడ్, ఆగస్టు 9: పత్తి, వరి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, తామర పురుగు ఉధృతిని రైతులు గుర్తించాలని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని శీలాంపల్లి, చందూర్, చిలిపిచెడ్ గ్రామాల్లో వరి, పత్తి పంటలను ఏవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తిలో తామర పురుగు ఆకుల అడుగు భాగాన చేరి ఆకులను గీకి రసాన్ని పీలుస్తాయన్నారు. నివారించడానికి ఇమిడాక్లోప్రిడ్ 0.25 ఎంఎల్, లేదా ఫిప్రోనిల్ 2ఎంఎల్ లేదా ఎసిఫెట్ 1.5గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరిలో కాండం తొలుచు పురు గు నివారణకు గుళికలు ఎకరానికి 8 కేజీలు వేసుకోవాలన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండ

శివ్వంపేట, ఆగస్టు 9: ప్రభుత్వం అందించే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు నిరుపేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని పాంబండకు చెందిన జి.గోవిందుకు రూ.60వేలు, రత్నాపూర్‌కు చెందిన లక్ష్మణ్‌కు రూ.21వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో భీమ్లతండా మాజీ సర్పంచ్ చెన్నా నాయక్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు

కౌడిపల్లి, ఆగస్టు 9: మండలంలోని లింగంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. లింగంపల్లి నుంచి నిజాంపేట పాఠశాలకు బదిలీపై ఆయన వెళ్లారు. గ్రామస్తులంతా కలిసి ఉపాధ్యాయుడి సేవలు గుర్తించి హెచ్ఎం శ్రీనివాస్‌కు టీవీని బహూకరించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌గౌడ్, కృష్ణాగౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

చల్లంగా చూడమ్మ నాగమ్మా..

- జిల్లాలో ఘనంగా నాగుల పంచమి
- పుట్టలో పాలు పోసిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మహిళా భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: పుట్టలో పాలు పోస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిలిపిచెడ్: నాగులమ్మకు పాలు పోస్తున్న మాజీ ఎంపీపీ వినోదదుర్గారెడ్డి, మహిళలు

రామాయంపేటలో పుట్టలో పాలుపోస్తున్న పురపాలిక వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి

మెదక్ మున్సిపాలిటీ/రేగోడ్/రామాయంపేట/ చేగుంట/నిజాంపేట/మెదక్‌రూరల్/వెల్దుర్తి/పెద్దశంకరంపేట/చిలిపిచెడ్/శివ్వంపేట/అల్లాదుర్గం/చిన్నశంకరంపేట, ఆగస్టు 9: జిల్లాలో నాగుల పంచమి ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. జిల్లా వ్యాప్తం గా పలు ఆలయాల్లోని నాగుల పుట్టల్లో మహిళా భక్తులు పాలు పోసి పూజలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మల్లంచెరువు కట్టపై నాగుల పుట్టలో పోసి, శివలింగానికి పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం నాగుల పంచమి కావడంతో మహిళలు నాగదేవత విగ్రహాలకు పూజలు చేశారు. బెల్లం, పిండివంటలు తయారు చేసి నాగేంద్రుడి ప్రతిమలకు పాలు పోసి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

మెదక్ రూరల్: రాజ్‌పల్లి శివాలయంలోని నాగదేవత ఆలయంలోని పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

నిజాంపేటలో ఎల్లమ్మ ఆలయ వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళ భక్తులు

చేగుంట మండల కేంద్రంలోని నాగులమ్మ దేవాలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళ భక్తులు

అల్లాదుర్గం: టేక్మాల్ గ్రామంలోని పాలాల్లో ఉన్న పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

శివ్వంపేట: చండి గ్రామంలోని నాగదేవత ఆలయంలో ఉన్న పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

పెద్దశంకరంపేట: పట్టణంలోని పాలాల్లో ఉన్నపుట్ట వద్ద పాలు పోస్తున్న మహిళలు

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

- డీఈవో రాధాకిషన్

దివ్యాంగులను పరీక్షిస్తున్న వైద్యులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 9: దివ్యాంగులకు చేయూతనిచ్చి, వారిలో మానసికస్థైర్యాన్ని నింపాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. శుక్రవారం సమగ్రశిక్ష, భారత కృతిమ అవయవాల నిర్మాణ సంస్థ సంయుక్తంగా జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల జిల్లాస్థాయి ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని 18 ఏండ్లలోపు దివ్యాంగ బాలబాలికలకు కావాల్సిన ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో 198 మంది పాల్గొన్నారు. వీరికి ముంబై నుంచి వచ్చిన డాక్టర్ల బృందం వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో సహిత విద్యా సమన్వయకర్త సతీశ్‌కుమార్, గుణాత్మక విద్యా సమన్వయకర్త సుదర్శన్‌మూర్తి, జిల్లా ఐఈఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ డబ్బు కోసం తల్లిని కడతేర్చిన తనయుడు

దుర్గవ్వ (ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 9: పింఛన్ డబ్బుల కోసం కన్న తల్లిని కొడుకు కడతేర్చిన ఘటన నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ని జాంపేటకు చెందిన రామచంద్రం కొన్నేండ్లు గా మద్యానికి బానిసై డబ్బుల కోసం ఇంట్లో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమం లో గురువారం రాత్రి పింఛన్ డబ్బులి వ్వాల ని తల్లి దుర్గవ్వ (70)తో గొడవపడ్డాడు . మద్యం మత్తులో చున్నీతో ఆమె మెడకు ఉ రేసి హత్య చేశాడు. ఘటనా స్థలానికి రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి చేరుకుని నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి కూతురు విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మెరుగైన పోలీస్ సేవలు అందించాలి

- పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి
- గ్రామాల్లో సీసీ కెమెరాల సంఖ్య పెంచాలి: ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 9: ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెల వారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్‌స్పాట్‌లు ఏర్పాటు చేసి, అధునాతన క్రైమ్ మ్యాపింగ్ తయారు చేసి, అక్కడ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి సిబ్బంది తెలిపారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల ఇన్వెస్టిగేషన్‌లో ఏఏ అంశాలు క్రోడీకరించాలో వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు కూలంకుషంగా పరిశోధన చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో వరుస దొంగతనాలు

చోరీ జరిగిన మణికుంఠా ట్రేడర్స్

రామాయంపేట, ఆగస్టు 9: రామాయంపేటలో వరుస దొంగతనాలతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలోని మూడు దుకాణాల్లో చోరీలు జరిగాయి. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం మణికంఠ ట్రేడర్స్, లక్ష్మీ ట్రేడర్స్, టీ స్టాల్‌లో దుకాణాలకు ఉన్న రేకులను వంచి లోపలికి ప్రవేశించి చోరీలకు పాల్పడ్డారు. లక్ష్మీ ట్రేడర్స్‌లో రూ.70 వేల నగదు చోరీ అయ్యింది. నిర్వాహకులు బొద్దుల సాగర్, దోమకొండ రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. మణికంఠ టీ స్టాల్‌లో నెలలో రెండు సార్లు చోరీకి పాల్పడ్డారు. పట్టణంలో వరుస దొంగతనాలు జరగడంతో వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం

సేవాలాల్ మహరాజ్, కొమురంభీం చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గిరిజనులు

అల్లాదుర్గం,ఆగస్టు 9: అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని టేక్మాల్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్, కొ మురంభీం చిత్రపటాలకు నివాళలర్పించారు. ఆదివాసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ జిల్లా సంఘం అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఆశ్రమ పాఠశాల వార్డెన్ లలిత, మారుతి, నరేందర్, కృష్ణ ప్రసాద్, సోని, రంజిత, చంద్రశేఖర్, వసంత్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలో టైంటేబుల్ కొనసాగించాలి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 9: ప్రాథమిక పాఠశాలల్లో పాత పద్ధతిలో టైంటేబుల్ కొనసాగించాలని పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి శుక్రవారం ప్రకటనలో కోరారు. విద్యార్థులకు పాఠశాలలో 40 నిమిషాలు బోధన సమయం ఎక్కువగా ఉండడంతో ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో 9 నుంచి 3 గంటల వరకు ఉండేదని, ఇప్పుడు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఉందన్నారు. ప్రభుత్వం పాత పద్ధతిలోనే సమయపాలన కొనసాగించాలని కోరారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

పిల్లి గణేశ్ (ఫైల్)

నర్సాపూర్, ఆగస్టు 9: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో నర్సాపూర్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన పిల్లి గణేశ్ (20) స్నేహితులతో కలిసి స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఐదు రోజుల క్రితం శ్రీశైలం డ్యామ్ చూడడానికి కారులో వెళ్లాడు. వారు ప్రయాణిస్తున్న కారు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మం డలం వాటవ్వర్లపల్లి నుంచి 14 కి.మీటర్ల దూ రంలో ఈనెల 4న రాత్రి రోడ్డు ప్ర మాదం జరిగింది. ఇందులో ముగ్గురు స్నేహితులు అక్కడికక్కడే మృతిచెందారు. గణేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి అచ్చంపేట దవాఖానకు, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందు తూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం గణేశ్ మృతి చెందాడు. గణేశ్ మృతితో నర్సాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

వెండి, బంగారు ఆభరణాల చోరీ

మనోహరాబాద్, ఆగస్టు 9: దుండగులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడిపల్లిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిపల్లికి చెందిన ఉమ గురువారం సాయంత్రం పనినిమిత్తం వేరే గ్రామానికి వెళ్లింది. శుక్రవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంట్లో ఉన్న బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులోని 60 తులాల వెండి, పావుతులం బంగారం చోరీకిగురైంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న ఎస్సై సుభాష్‌గౌడ్